క్లుప్తంగా

మెటల్ రోడ్డు పనులు ప్రారంభం

రాయికోడ్ (అందోల్): మండలంలోని యాసు ఫ్‌పూర్ గ్రామంలో బుధవారం మెటల్ రోడ్ నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెటల్ రోడ్ నిర్మాణం పూర్తి అయితే తమ గ్రామం నుంచి కప్పాడు, రాయికోడ్, ధర్మపూర్ గ్రామాలకు వెళ్లే మార్గంలో బురద రోడ్ల ఇబ్బందులు తీరుతాయని తెలిపారు. తమ గ్రామానికి మెటల్ రోడ్ మంజూరు చేసిన మంత్రి దమోదరరాజానర్సింహ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యుడు రమేష్ కుమార్ పాటిల్, మాజీ సర్పంచులు జైపాల్ రెడ్డి, ఖాజామియా, నాయకులు భద్రప్ప, సంజీవయ్య, మొగులయ్య, కుమార్, తుకారాం ఉన్నారు.

దౌల్తాబాద్‌కు వెళ్లే రోడ్డును బాగు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్‌కు వెళ్లే రహదారిపై లారీలు, టిప్పర్లు ఎక్కువగా ప్రయాణిస్తుండటంతో రోడ్డు అధ్వానంగా మారింది. బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం పార్టీ శ్రేణులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రేశం మీదగా దౌల్తాబాద్ వెళ్లే రోడ్డు గుంతమయంగా మారిందని, దీంతో ఈ రోడ్డు మీదగా వెళ్లే ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వర్షాకాలంలో రహదారి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, జిల్లా నాయకులు అల్లం రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ధనుంజయ గౌడ్, రమేష్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు వెంకటయ్య, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలను తొలగిస్తాం

ఆర్అండ్‌బీ డీఈ రవీందర్



దుకాణాలను పరిశీలిస్తున్న డీఈ రవీందర్

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం దౌల్తాబాద్ కాసాల గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణ డబ్బాలను వెంటనే తొలగించాలని రోడ్డు భవనాల శాఖ డీఈ రవీందర్ యజమానులను ఆదేశించారు. బుధవారం ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన డబ్బాలను డీఈ రవీందర్ పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన డబ్బులను తొలగిస్తామని పేర్కొన్నారు. డబ్బాల ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరారెడ్డి అన్నారు. బుధవారం అందోల్ పరిధిలోని కొడెకల్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జగన్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, నారాయణరెడ్డి, సంజీవులు, మొగులయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

శని అమావాస్య ఉత్సవాలకు ఏర్పాట్లు



శనీశ్వరుడు

నారాయణఖేడ్: మండలంలోని పంచగామ శివారులో వెలసిన శనీశ్వర ఆలయంలో ఈ నెల 29న శని అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. శనివారం నాడు అమావాస్య వస్తుండటం.. క్రోదినామ సంవత్సరంలో చివరి రోజు తెలుగు నూతన సంవత్సరం ప్రారంభానికి ముందు రోజు రావడంతో ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉంది. అరుదుగా వచ్చే శని అమావాస్య రోజు శనీశ్వరుడికి పూజలు చేస్తే దోషాల నివారణ జరుగుతుందని భక్తుల నమ్మకం. ఉదయం ఆలయంలో తైలాభిషేకాలు పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కాశీనాథ్ బాబా తెలిపారు.

ఇదోరకం.. ఆక్రమణ

- ఇరుకుగా మారిన మున్సిపాలిటీ రోడ్లు
- నగం రోడ్డుపై వ్యాపారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



సదాశివపేట పట్టణంలో ఇరుకుగా మారిన శాస్త్రి రోడ్డు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలో ఎక్కడ చూసినా భూఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కబ్జాకోరల్లో మున్సిపాలిటీ స్థలాలు మక్కిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకునీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు ముందు స్థలం అక్రమించుకోవడంతో సామాన్య ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పట్టణ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. సదాశివపేట మున్సిపాలిటీ ఆక్రమణల్లో ముందు వరుసలో ఉందని చెప్పవచ్చు. అక్రమాలకు నిలయంగా మున్సిపాలిటీ మారిందనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమలు తొలగింపులో అధికారులు ఏ మాత్రం ముందుకు వెళ్లడం లేదు. రెండేళ్ల కిందట అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టిన మరుసటి రోజే మళ్లీ అక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో సామాన్య మధ్యతరగతి ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఒక్కో దుకాణదారుడు కొన్ని అడుగులు ముందుకు రావడంతో రోడ్లన్నీ ఇరుకుగా మారాయి. దుకాణదారులు మున్సిపాలిటీ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతూ దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్నారు. పట్టణంలోని సిద్ధాపూర్ రోడ్డు, శాస్త్రిరోడ్డు, తిలక్‌రోడ్డు, సుభాష్‌రోడ్డు, పాతపేరుమాళ్ల హనుమాన్ మందిరం నుంచి శంభులింగేశ్వర మందిరం వరకు, అయ్యప్ప మందిరం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్లలోని పలు దుకాణదారులు స్థలాలను కబ్జా చేశారు. మున్సిపల్ కార్మికులు మురుగునీటి కాల్వలను శుభ్రం చేసేందుకు సైతం కాల్వలు కనిపించకుండా నిర్మాణాలు చేపట్టారు. రోడ్లపైనే దుకాణదారులు వ్యాపార బోర్డులను పెడుతున్నారు. నిత్యం వందలాది సంఖ్యలో మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పట్టణానికి వస్తుంటారు. వాహనాలు నడిపేందుకు ఇరుకు స్థలాలతో ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల ముందు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పట్టణ జనాభా పెరుగుతున్న ఆక్రమణలు తొలగింపులు జరగడం లేదు.

చర్యలు శూన్యం

వ్యాపారులు మున్సిపల్ స్థలాలను రోడ్లను అక్రమిస్తున్నారు. దుకాణాలను మరింత ముందుకు రావడంతో ప్రధాన రోడ్లు ఇరుకుగా మారాయి. పట్టణంలో ప్రధాన సమస్యగా మారిన పట్టించుకునే వారు లేకుండా పోయారు. రెండేళ్లకు, మూడేళ్లకు తూతూమంత్రంగా ఆక్రమణలు తొలగించడం మళ్లీ యథాతథంగా వ్యాపారాలు నిర్వహించుకోవడం షారా మామూలైంది. ఇప్పటికైనా అక్రమణలు తొలగించి రోడ్లు వెడల్పు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఉమ వివరణ కోసం ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయింపు



స్థల పత్రాలు అందజేస్తున్న సంగ్రామ్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ స్థలానికి కేటాయిస్తూ పంచనామ పత్రాలను బుధవారం తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి విద్యుత్ శాఖ ఏడీ నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ.. నూతన సబ్‌స్టేషన్ నిర్మాణంతో 20ఏళ్ల విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆదర్శ్‌రెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేజీబీవీకు స్థలం..

వట్‌పల్లి(అందోల్): మండలంలో కేజీబీవీ పాఠశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని బుధవారం కేటాయించారు. మండల పరిధిలోని మర్వెళ్లి గ్రామంలో 389 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో 5 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు పంచనామ నిర్వహించి.. సంబంధించిన కాపీని అందజేసినట్లు మండల విద్యాధికారి గోవింద్‌రెడ్డి తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వం వెంటనే జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు ఖేడ్ ప్రాంతంలో భారీ ఎత్తున జొన్నసాగు చేశారని, ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.3,370ల ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. గతంలో తమ ప్రభుత్వం జొన్నల కోత దశలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేశారని తెలిపారు. ప్రస్తుతం జొన్న కోతలు సాగుతున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు కర్ణాటకలోని బీదర్ తరలించి విక్రయిస్తున్నారని, వీరికి తోడు దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారని వాపోయారు. రైతులు శ్రేయస్సును దృష్ట్యా ఉంచుకొని జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, నాయకులు వెంకటేశం, సిద్ధు, మల్గొండ, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ఝరాసంగం(జహీరాబాద్): యువత సేవాగుణం అలవర్చుకోవాలని ఎస్ఐ సంగమేశ్వర్, ప్రిన్సిపాల్ హరికుమార్ అన్నారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన ఆచార్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు మండలంలోని సంగం(కె) గ్రామంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రజలకు పారిశుద్ధ్యం, మూఢనమ్మకాలపై అవగాహన చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని, లక్ష్యం దిశగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకట్రాంరెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, నందుగౌడ్, దత్తు, నవీన, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కార్మికులకు ప్రతి నెలా జీతాలివ్వాలి



సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు నరసింహరెడ్డి మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా ఈఎస్ఐ ఆస్పత్రిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారని ఆరోపించారు. బిల్లు రావడంలేదని కార్మికులకు కాంట్రాక్టర్లు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పని చేసి జీతం కోసం ప్రతి నెల అడుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. మార్చి నెల తరువాత కొత్త కాంట్రాక్టర్‌లను ఎంపిక చేసే ముందు ఒప్పంద ప్రకారం కార్మికులకు ప్రతి నెల జీతాలు, ఇతర సమస్యలు పట్టించుకునే వారికి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, పుష్పలత, సునీత, రాఘువేంద్ర ఉన్నారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



యశస్వీ



ఈడిగి హర్షవర్ధన్‌గౌడ్

వట్‌పల్లి(అందోల్): జవహర్‌లాల్ నవోదయ విద్యాలయం 2025–26 విద్యా సంవత్సరానికి నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. మండలానికి చెందిన పల్లె యశస్వీ, హర్షవర్ధన్‌గౌడ్ అనే ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి గోవింద్‌రెడ్డి తెలిపారు. యశస్వి వట్‌పల్లిలోని అక్షర పాఠశాల, హర్షవర్ధన్‌గౌడ్ డాన్‌బాస్కో పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. వీరు జనవరి 18న జరిగిన ప్రవేశ పరీక్షలకు హాజరై అత్యధిక మార్కులు సాధించి సీటును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో సీటు సాధించగలిగానని తెలిపారు. విద్యార్థులు నవోదయకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌లోని దుర్గాభవానీమాత ఆలయ 18వ వార్షికోత్సవాన్ని బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించి చండీహవన పురస్సర, లలితా సహస్రనామ పారాయణం, మూలమంత్ర హవనం, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఉదయ్‌కుమార్ సాగర్ దంపతులు, బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి, లలితాదేవి సేవామహిళామణులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



కీరురాథోడ్ (ఫైల్)

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం రాయిపల్లి తండా మాజీ సర్పంచ్ కీరురాథోడ్ బుధవారం మృతి చెందారు. గత కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని సిటిజన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మాజీ సర్పంచ్ మృతిపై బంజార నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

బేకరీ ఓవెన్ ప్రారంభం



బేకరీని ప్రారంభిస్తున్న స్పెషల్ ఆఫీసర్ గీత

జోగిపేట(అందోల్): అందోల్ – జోగిపేట పురపాలక సంఘం మెప్మా పరిధిలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా పీఎంఎఫ్ఎంఈ' పథకం కింద జోగిపేట సభ్యురాలు జీనత్ బేగంకు రూ. 9.44 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా బేకరీ ఓవెన్‌ను మెప్మా పథకం సంచాలకులు గీత బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి, బ్యాంక్‌మేనేజర్ నాగరాజు, మెప్మా టీఎంసీ భిక్షపతి గౌడ్, ఆర్పీ అనితలు పాల్గొన్నారు.

నూతన నియామకం



సంగయ్యస్వామిని సన్మానిస్తున్న గ్రామపెద్ద

నారాయణఖేడ్: దూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని లింగాపూర్‌కు చెందిన సంగయ్యస్వామి నియమితులయ్యారు. ఇటీవల జరిగిన నియామకాల్లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నేడు ఇఫ్తార్ విందు

నారాయణఖేడ్: ప్రభుత్వం తరఫున నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 27న జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్‌అలీ తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు ఆర్డీఓ అశోక చక్రవర్తి, డీఎస్పీ వెంకట్ రెడ్డి తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. డివిజన్ పరిధిలోని ముస్లింమైనార్టీలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హరినామ సప్తహ

నారాయణఖేడ్: మండలం పరిధి చాప్టా(కె) గ్రామంలో అఖండ హరినామ సప్తహ కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం కేదార్నాథ్ ఆలయ ప్రధాన పూజారి శివలింగ స్వామి, మల్లన్నగుట్ట పీఠాధిపతి బసవలింగ అవధూత మహరాజ్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులను గౌరవిస్తేనే జీవితం ధన్యమవుతుందని తెలిపారు. అనంతరం నిర్వాహకులను పూలమాలలతో సత్కరించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం కోర్టులో హాజరుపరచగా ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున, ఐదుగురికి రూ .1500 చొప్పున, మరో నలుగురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం రాయితీ

మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి

పటాన్‌చెరు: ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90 శాతం మాఫీ పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి, వ్యాపార సంస్థల యజమానులు తమ ఆస్తిపన్నుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఈ నెల 31లోపు ఆస్తిపన్ను బకాయిలన్నింటిని చెల్లిస్తే బకాయిలపై ఉన్న వడ్డీలో 90 శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం వన్ టైం సెటిల్మెంట్ కింద ఈ అవకాశాన్ని కల్పించిందని చెప్పారు.

బొల్లారం మున్సిపల్ పరిధిలో..

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆస్తిపన్ను బకాయిదారులకు ఓటీఎస్ పద్ధతిలో 90 శాతం వడ్డీపై రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి మార్చి 31లోగా 90 శాతం వడ్డీ రాయితీతో పన్ను చెల్లించవచ్చన్నారు. ముందుగా చెల్లించిన వారికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో జమ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు, బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠ



యజ్ఞంలో పాల్గొన్న నరేష్‌గౌడ్ భక్తులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని రంజోల్ బాబానగర్‌లో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మూడు రోజుల పాటు కనుల పండువగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను వేదబ్రహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తులు కోలహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, యజ్ఞం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బాబానగర్, రంజోల్, బాబానగర్ కాలనీ ప్రజలు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం వితరణ చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి నుంచి బాధితులకు చెక్కులు మంజూరయ్యాయి. పెద్దశంకరంపేట మండలం మూసాపేటకు చెందిన విజయకు రూ.30 వేలు, ఖేడ్ మండలం తుర్కాపల్లికి చెందిన చిరంజీవి తల్లికి రూ.11 వేల చెక్కులను బుధవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రేయారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పరమేష్, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు అంబలి పంపిణీ



కూలీలకు అంబలిని అందజేస్తున్న ప్రతినిధులు

నారాయణఖేడ్: మండలంలో ర్యాకల్‌గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు అంబలి పంపిణీ చేశారు. జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రప్ప మశ్చందర్ సూచనతో ప్రతినిధులు పరశురాంరెడ్డి, శ్రీనివాస్, తుకారాం సంచార వాహనంతో ఉపాధిహామీ పనులు జరుగుతున్న చోటుకు వెళ్లి అంబలిని అందజేశారు. అంబలితో ఎండలో పనిచేస్తున్న కూలీలు ఉపశమనం పొందారు. సామాజిక సేవలో భాగంగా సంచార అంబలి కేంద్రాల ద్వారా నియోజకవర్గం వ్యాప్తంగా అంబలి పంపిణీ చేస్తున్నట్లు మశ్చందర్ తెలిపారు.

ప్రాణాలు పోతేనే స్పందిస్తారా..?



ప్రమాదకరంగా ఒరిగిన విద్యుత్ స్తంభాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఆనుకొని విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా రోడ్డు వైపునకు ఒరిగాయి. ఈ మార్గంలో అనేక స్తంభాలు రోడ్డు వైపు ఒరిగి ఎప్పుడు కింద పడతాయో అన్నట్లుగా ఉన్నాయి. నిత్యం ఈ మార్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తుంటారు. వారికి ఈ సమస్య కనిపించకపోవడం గమనార్హం. ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని పోవాల్సిన పరిస్థితి నెలకొంది. స్తంభాల కిందపడి ఎవరివైనా ప్రాణాలు పోతేనే అధికారులు స్పందిస్తారా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన స్తంభాలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.